సాక్షి
వికారాబాద్

గురువారం । 27 । ఏప్రిల్ । 2023



సినిమా డైలాగ్‌లు చెల్లవు

రాజకీయాల్లో సినిమా డైలాగ్‌లు చెల్లవని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి హితవు పలికారు. 8లో▸



ఆస్పత్రిలో వసతులు నిల్

పెద్దేముల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో వసతుల లేమితో వైద్య సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 9లో▸



ప్రయాణం.. నరకప్రాయం

దౌల్తాబాద్ నుంచి గుముడాల మీదుగా బిచ్చాల గ్రామం వరకు వెళ్లే రోడ్డుపై వెళ్లాలంటేనా జంకుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఘాటెక్కిన మిర్చి

కిలో రూ.250



పెద్దేముల్‌లో విక్రయిస్తున్న ఎర్ర మిర్చి

పెద్దేముల్: ఎండలు ముదరడంతో ఎర్ర మిర్చి ధరలు భగ్గు మంటున్నాయి. గత ఏడాది రూ.120 నుంచి రూ.130 కిలో పలికిన ఎర్ర మిర్చి నేడు రూ.250 వరకు పలుకుతోంది. మార్కెట్లో ధరలు హెచ్చు తగ్గులు అవుతున్నా వ్యాపారులు మాత్రం తగ్గించడం లేదు. ఎండలు మండుతుండటంతో ధరలు పెరుగు తుంటాయని వ్యాపారస్తులు అంటున్నారు. వ్యాపారస్థులు ఆటోలు, వ్యాన్‌ల ద్వారా గ్రామ గ్రామాన తిరిగి విక్రయిస్తున్నారు. పచ్చి మిర్చి ధరలు కూడా రూ.60 నుంచి రూ.80కిలో పలు కుతోంది.

సీపీఆర్‌తో ప్రాణాన్ని కాపాడవచ్చు

పోలీసులకు అవగాహన



సీపీఆర్ పద్ధతిని వివరిస్తున్న వైద్యులు

కొడంగల్ రూరల్: అత్యవసర, ప్రాణాపాయ పరిస్థితుల్లో వ్యక్తికి సీపీఆర్ పద్ధతిలో ప్రాణాన్ని కాపాడవచ్చని కుల్కచర్ల మెడికల్ ఆధికారి వాజీదొద్దిన్ బొంరాస్‌పేట మెడికల్ అధికారి హేమంత్‌లు పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు. బుధవారం పట్టణంలోని పీహెచ్ సీలో ప్రాణాపాయ స్థితిలో సీపీఆర్ ద్వారా కాపాడే పద్ధతులను వివరించారు. నాడీ వ్యవస్థ పనిచేయని స్థితిలో సీపీఆర్ పద్ధతితో ఎలా చేయాలో బొమ్మను ఉపయోగించి విధి విధానాలను వివరించారు. వ్యక్తికి మెలుకువ రాగానే చికిత్స అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ శంకర్, కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల ఎస్‌ఐలు రవి, శంకర్, రమేశ్‌కుమార్‌తోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్చకునికి శంకరాచార్య పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అర్చకుడు విజయకుమార స్వామి

తాండూరు టౌన్: పట్టణంలోని భావిగి భద్రేశ్వర స్వామి ఆలయ అర్చకుడు విజయకుమార స్వామికి ఆది శంకరాచార్య పురస్కారం దక్కింది. ఆది శంకరాచార్య జయంతి వేడుకలను పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని త్రినయన సాంస్కృతిక కళా నిలయం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేశారు. అంతేకాకుండా పరమశివున్ని దేశంలోని పలు శివాలయాల్లో దర్శనమిచ్చే అవతారాల్లో అలంకరించడంలో ఆయన ప్రసిద్ధులు. దీంతో ఆయనకు అలంకార స్మామ్రాట్ అనే బిరుదును సైతం అందజేశారు. ఈసందర్భంగా తాండూరు వాసులు ఆయనకు అభినందనలు తెలిపారు.

సరిహద్దులో నిఘా పటిష్టం



కర్ణాటక సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

బంట్వారం: కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో సరిహద్దులో నిఘా పటిష్టం చేసినట్లు సీఐ అప్పయ్య తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం ఆయన బంట్వారం మండలంలోని బొప్పునారం శివారులో పోలీసు చెక్ పోస్టు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెక్‌పోస్టు దగ్గర 24 గంటలూ పోలీసులు విధుల్లో ఉంటారన్నారు. ఎప్పటికప్పుడు వాహనాలను తనిఖీ చేస్తారని చెప్పారు. సరిహద్దులో తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు. వాహన దారులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ అంజాద్ తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: మొరంగపల్లిలో వడగళ్ల వానకు దెబ్బతిన్న బొప్పాయి తోట



దౌల్తాబాద్: తడిసిన ధాన్యం కుప్పలు



రామ్‌నాథ్‌గుడుపల్లిలో పాడైన టమాటా పంట

పగబట్టిన వరుణుడు

రైతన్న కష్టం వర్షార్పణమైంది. వడగళ్లతో కూడిన వానలు రైతన్నను నట్టేట ముంచాయి. జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసినప్పటికీ ఎక్కువగా మోమిన్‌పేట, మర్పల్లి మండలాల్లో వడగళ్లతో కుండపోత కురిసింది. పగబట్టినట్టుగా వరుణుడు మంగళవారం సాయంత్రం, తిరిగి బుధవారం ఉదయం పై మండలాల్లో వడగళ్లతో విరుచుకుపడ్డాడు. దీంతో వేల ఎకరాల్లో పంటలు తుడిచిపెట్టుకు పోయాయి. రైతన్నలు కన్నీటిపర్యంతమవుతున్నారు.

రైతన్న నెత్తిన రాళ్ల వాన

- ఆరుగాలం కష్టం వర్షార్పణం
- వేల ఎకరాల్లో పంటలు ధ్వంసం
- బొప్పాయి, టమాటా, మామిడి, కూరగాయల పంటలు నేలమట్టం
- మోమిన్‌పేట, మర్పల్లి మండలాల్లో నష్టం అపారం
- ఏరులై పారిన వాగులు, వంకలు

వికారాబాద్: గాలివాన బీభత్సంతో మర్పల్లి, మోమిన్‌పేట మండలాల్లో జన జీవనం అతలాకుతలమైంది. వడగళ్ల వర్ష బీభత్సానికి నష్టం ఊహించని స్థాయిలో సంభవించింది. ప్రధానంగా ఉద్యాన పంటలకు ఎక్కువ నష్టం జరిగింది. జిల్లాలో అత్యధికంగా మోమిన్‌పేటలో 90 మిల్లీ మీటర్లు, మర్పల్లిలో 70, తాండూరులో 52 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. జిల్లాలో సగటున 32 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. చౌడాపూర్, కోట్‌పల్లి మండలాలు మినహా అన్ని మండలాల్లో వర్షపాతం నమోదయ్యింది.

వంద శాతం పంటల నష్టం

మర్పల్లి, మోమిన్‌పేట, బంట్వారం, నవాబుపేట మండలాల్లో వందశాతం పంటలు పాడయ్యాయి. బొప్పాయి, మామిడి, టమాటా, వంకాయ, బీర,



దోమ: ఖమ్మం నాచారంలో పిడుగు పాటుతో మృతిచెందిన ఆవు, దూడ

చిక్కుడు, కాకర, బెండ, మునగ, గుమ్మడి, బూడిద గుమ్మడి, కర్బూజ, సొరకాయ తదితర పంటలు వడగళ్ల ధాటికి పూర్తిగా నేలమట్టమయ్యాయి. మామిడి తోటల్లో ఉన్న కాయలు పిందెలతో సహా రాలిపోయాయని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. బొప్పాయి తదితర తోటల్లో కాండం, ఆకులతో సహా నేల రాలాయి. టమాటా పొలాల్లో కాయలు, పండ్లు పగిలిపోయాయి. మొక్కలన్నీ ధ్వంసమయ్యాయి. ఉల్లి పొలంలోంచి తీసి ఆరబెట్టే సమయం కావడంతో బాగా నష్టం వాటిల్లింది. మోమిన్‌పేట, మర్పల్లి, నవాబుపేట, బంట్వారం మండలాల్లో అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం 127 మంది రైతులకు సంబంధించి 190 ఎకరాలు, ఉద్యాన పంటలు 118 రైతులకు చెందిన 165 ఎకరాలు మొత్తం 245 మంది రైతులకు చెందిన 365 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే నష్టం వేల ఎకరాల్లో ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

పంటలన్నీ నేలమట్టం

వికారాబాద్, మోమిన్‌పేట, నవాబుపేట, పరిగి, తాండూరు, కొడంగల్ తదితర మండలల్లోనూ వర్షం కురిసింది. అయితే నష్టం అధికంగా మర్పల్లి, మోమిన్‌పేట, బంట్వారం, నవాబుపేట మండలల్లోనే సంభవించింది. వడగళ్లు పెద్ద సైజులో పడటంతో బొప్పాయి, గుమ్మడి, సొరకాయలు, కర్బూజ పంటలు ఎక్కువగా పాడయ్యాయి. మోమిన్‌పేట మండల పరిధిలోని రామ్‌నాథ్‌గుడుపల్లిలో వెంకటేశం అనే రైతుకు చెందిన పౌల్ట్రీ ఫాం పూర్తిగా ధ్వంసమైంది. పక్కనే వారు నివసించే ఇల్లు సైతం పూర్తిగా నేలమట్టం అయ్యింది. ఇదే రైతుకు చెందిన రెండెకరాల టమాటా పంట పూర్తిగా దెబ్బతిన్నది. మొత్తంగా ఆ రైతుకు రూ. 50 లక్షల కు పైగా నష్టం జరిగిందని బోరున విలపిస్తున్నారు. వాగులు వంకలు సైతం ఏరులై పారాయి.



మోమిన్‌పేట: రామ్‌నాథ్‌గుడుపల్లిలో నేలమట్టమైన కోళ్లఫారం

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

- జిల్లా వ్యవసాయాధికారి గోపాల్
- దెబ్బతిన్న పంటల పరిశీలన

మోమిన్‌పేట: అకాల వర్షాలతో పంటలు కోల్పోయిన రైతులు అధైర్యపడవద్దని, అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మొరంగపల్లిలో కురిసిన వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న బొప్పాయి, మునగ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మోమిన్‌పేట మండల పరిసర గ్రామాల్లో అత్యధిక వర్షం కురిసిందన్నారు. గత నెలలో కురిసిన వడగళ్ల వర్షానికి పంటలు దెబ్బతినడంతో వాటికి సంబంధించిన పరిహారం వారంరోజుల్లో రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటలపై నష్టం అంచనా వేస్తున్నామన్నారు. త్వరలో పూర్తి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. రైతులు అధైర్యపడవద్దని ఆయన చెప్పారు. ఆయన వెంట జిల్లా ఉద్యానశాఖాధికారి చక్రపాణి, అధికారి గఫూర్, మండల వ్యవసాయాధికారి జయశంకర్, రైతులు ఉన్నారు.



మొరంగపల్లిలో మునగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ తదితరులు

బూత్‌స్థాయి అధికారుల నియామకం



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్, అధికారులు

- ఎన్నికల ప్రక్రియకు ఏర్పాట్లు
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: జిల్లాలో ఎన్నికల ప్రక్రియకు పూర్తి స్థాయిలో బూత్ స్థాయి అధికారులను నియమించినట్లు కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లాలో చేపడుతున్న ఏర్పాట్లును కలెక్టర్ వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఇప్పటి వరకు 1,130 పోలింగ్ బూత్‌లకు బీఎల్‌ఓ లను నియమించామని, ఇప్పటి వరకు 815 మంది బీఎల్‌ఓలు యాప్‌లో లాగిన్ అయినట్లు తెలిపారు. మిగతా 315 మంది లాగిన్ కావాలని ఆదేశించారు. గతంలో తక్కువగా పోలింగ్ అయిన నియోజకవర్గాలను గుర్తించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం కేంద్రంగా తీసుకొని సోషల్ మీడియా బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి కోటాజి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలన అస్తవ్యస్తం

- సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్
- ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం



ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్న సీపీఐ నాయకులు

తాండూరు టౌన్: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలన అంతా అస్తవ్యస్తంగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ అన్నారు. బుధవారం పట్టణంలో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్న తీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ నేటి వరకు నిర్వహించకపోవడం సిగ్గు చేటన్నారు. తాండూరు ప్రాంతంలో అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందడంలేదన్నారు. సరైన ఆధునిక పరికరాలు, స్పెషలిస్టు డాక్టర్లు లేకపోవడమే కారణమన్నారు. దళిత బంధు అవినీతి మయంగా మారిందని దుయ్యబట్టారు. హక్కుల కోసం కార్మికులు పోరాడితే వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడం కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ పెట్టుబడి దారులకు అమ్మేసి, పేదలను మరింత నిరుపేదలుగా మారుస్తోందని మండిపడ్డారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నదని అన్నారు. పేద ప్రజలకు న్యాయం, అభివృద్ధి జరగాలంటే అటు కేంద్రంలో బీజేపీని, ఇటు రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.

ఓటరులిస్టులో తప్పొప్పులు సరిచేసుకోండి

పరిగి: ఓటరు లిస్టులో తప్పొప్పులు ఉంటే సవరించుకోవాలని ఆర్డీఓ విజయకుమారి సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 305 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. ఇప్పటి వరకు ఉన్న ఓటరులిస్టులను ఆయ పార్టీల నాయకులకు అందజేశామన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు కార్డు కోసం దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరణించిన వారి పేర్లు లిస్టులో ఉంటే వాటిని తొలగించేందుకు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి గురువారం అన్ని పార్టీ నాయకులతో ఓటు హక్కుపై సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆయా పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ విజయకుమారి

మంబాపూర్‌లో నిధుల గోల్‌మాల్

- గతంలో పనిచేసిన కార్యదర్శి చేతివాటం
- రూ.10 లక్షల 20వేలు స్వాహా
- ఫోర్జరీతో చెక్కులు డ్రా
- ఎంపీడీఓకు సర్పంచ్ ఫిర్యాదు

పెద్దేముల్: మండల పరిధిలోని మంబాపూర్‌లో నిధులు స్వాహా అయ్యాయి. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి కమ్రొద్దిన్ స్వచ్ఛ భారత్ మరుగుదొడ్ల (ఎస్‌బీఎం) నిధులలో చేతివాటం ప్రదర్శించారు. సర్పంచ్, వీవోల సంతకాలను ఫోర్జరీ చేసి నిధులు డ్రా చేశారు. రెండు రోజుల క్రితం ఎస్‌బీఎం సంతకం కొత్త పంచాయతీకి మారిన సమయంలో బ్యాంకుకు వెళ్లగా స్వాహా విషయం బయటపడింది. దీంతో సర్పంచ్ శ్రావన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి యశ్వంత్‌లు బ్యాంకు ద్వారా పూర్తి వివరాలు సేకరించి బుధవారం ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ షేక్‌సుస్మాలకు తెలిపారు. కమ్రొద్దిన్ మే 2022లో పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. నవంబర్ 2, 2022 లాంగ్ లీవ్ పై వెళ్లిపోయారు. ఆయన పని చేసిన ఆరు నెలల్లో ఐదు చెక్కుల ద్వారా రూ.10 లక్షల 20వేలు డ్రా చేసినట్లు తేలింది. సర్పంచ్, వీవో సంతకాలను ఫోర్జరీ చేసి తన కుటుంబ సభ్యుల పేరున డబ్బులు డ్రా చేసినట్లు గుర్తించారు. బుధవారం మంబాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మప్ప సమక్షంలో స్థానిక ఎంపీటీసీ శ్రీనివాస్, వార్డు సభ్యులు సమావేశమయ్యారు. గతంలో పని చేసిన కార్యదర్శి ఫోర్జరీ విషయాన్ని సర్పంచ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిధులు దుర్వినియోగం పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ శ్రీనివాస్ అధికారులను కోరారు.



ఎంపీడీఓ లక్ష్మప్పకు వివరిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు

ప్రపంచ దేశాలకు దీటుగా అంతరిక్ష పరిశోధనలు

భారత తొలి వ్యోమగామి రాకేష్‌శర్మ

- ఇతర గ్రహాలపై మానవ మనుగడ అంత సులువు కాదు
- ప్రస్తుతం గగన్‌యాన్‌పై ఇస్రో దృష్టి
- అంతరిక్షం నుంచి భారత్‌ను చూడటం గొప్ప అనుభూతినిచ్చింది
- మళ్లీ అవకాశం వస్తే వదులుకోను..

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత అధునాతన సాంకేతిక యుగంలో అన్ని దేశాలు అంతరిక్ష పరిశోధనలపైన దృష్టి సారించాయి. భారత్ కూడా ఇస్రో ఆధ్వర్యంలో ఇప్పటికే చంద్రయాన్ వంటి ప్రాజెక్టులను చేపట్టింది. త్వరలో ప్రతిష్టాత్మక గగన్‌యాన్‌ను అంతరిక్షంలోకి పంపించే ప్రయత్నంలో ఉంది. 40 ఏళ్ల క్రితమే భారత్‌కు చెందిన వింగ్ కమాండర్ రాకేష్ శర్మ అంతరిక్షంలో మొదటిసారిగా కాలుమోపారు. సోవియట్ ఇంటర్ కాస్మోస్ ప్రాజెక్ట్‌లో భాగంగా 1984లో అంతరిక్షం చేరిన మొదటి భారతీయ వ్యోమగామిగా రాకేష్ శర్మ చరిత్ర సృష్టించారు. హైదరాబాద్‌లోని సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేసి, నిజాం కళాశాల నుంచి పట్టభద్రులైన రాకేష్ శర్మ అనంతరం స్పేస్ రీసెర్చ్‌లో తన ప్రాతినిధ్యాన్ని పంచుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ 106వ స్థాపకదినోత్సవం సందర్భంగా బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పట్లో అంతరిక్షం నుంచి ప్రధాని ఇందిరాగాంధీతో మాట్లాడినప్పుడు.. అక్కడినుంచి భారత్ ఎలా కనిపిస్తోందని ఆమె అడిగితే.. 'సారే జహాసే అచ్చా..'అని చెప్పానంటూ ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అంతరిక్ష యానానికి సంబంధించి రాకేష్‌శర్మ తెలిపిన ఆసక్తికర విషయాలు ఆయన మాటల్లోనే..





ఓయూలో మాట్లాడుతున్న రాకేష్‌శర్మ

వనరులు, ప్రత్యామ్నాయ వేదికల అన్వేషణ దిశగా..

భారత్‌లో 40 ఏళ్ల క్రితం ఉన్న సాంకేతికతకు, ప్రస్తుత అధునాతన టెక్నాలజీకి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. అంతరిక్ష పరిశోధనల్లో భారత్ ప్రపంచ దేశాలకు పోటీగా మారింది. స్పేస్ టెక్నాలజీలో ఎంతో అభివృద్ధి చెంది సొంతగా ఎన్నో విజయవంతమైన ప్రాజెక్టులను చేపట్టింది. ఇందులో ఇస్రో కీలకపాత్ర పోషిస్తోంది. రానున్న ఏడాదిలో ప్రతిష్టాత్మకమైన గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములను పంపించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు నేను నేషనల్ అడ్వైజరీగా ఉండి పలు అంశాలను పర్యవేక్షిస్తున్నా.

గట్టి పునాదులు వేశారు..

అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి విక్రమ్ సారాభాయ్ వంటి పరిశోధకులు గట్టి పునాది వేశారు. దానిని విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత ప్రస్తుత తరంపై ఉంది. భవిష్యత్ అంతరిక్ష పరిశోధనలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే వనరులను అన్వేషించనున్నాయి. భూమిపై పర్యావరణం క్షీణిస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ వేదికలను సైతం వెతకనున్నాయి. చంద్రుడిపై మనిషి మనుగడ సాధ్యమే కానీ అది సాకారం కావాలంటే ఎంతో పురోగమించాలి.

అంతరిక్షంలో యోగా చేశా..

అంతరిక్షంలో ప్రయాణించాలంటే ముందే కఠినమైన శిక్షణ తీసుకోవాలి. అంతరిక్ష నౌక ప్రయాణ వేగం భూమ్యాకర్షణ శక్తికి వ్యతిరేకంగా ప్రతి సెకనుకు సున్నా నుంచి ఏడున్నర కిలోమీటర్లు పెరుగుతుంది. ఈ సమయంలో శరీరంపై చాలా ప్రభావం పడుతుంది. గుండె నుంచి వివిధ అవయవాలకు రక్తం సరఫరాపైనా ప్రభావం పడుతుంది. ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా మారుతుంది. ఇవన్నీ తట్టుకోవడానికి వీలుగా సాధారణ స్థాయి కన్నా నాలుగు రెట్ల వేగంతో రక్త ప్రసరణ జరిగేలా శిక్షణ ఉంటుంది. ఇందుకోసం నేను యోగా సాధన కూడా చేశా.

అవకాశాల్ని యువత అందిపుచ్చుకోవాలి..

అంతరిక్షంలో నేను యోగా చేస్తుంటే దీని ఫలితాలు గమనించి ఒకరిద్దరు తోటి వ్యోమగాములు కొన్ని ఆసనాలను అడిగి మరీ ప్రయత్నించారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా వ్యోమగాములకు సెంట్రిఫ్యూజ్ ఆధారిత శిక్షణ ఇస్తున్నారు. అంతరిక్షం నుంచి భారత్ మిశ్రమ వర్ణాల్లో అద్భుతంగా కనిపిస్తుంది. రాజస్థాన్ బంగారు వర్ణంలో, హిమాలయాలు ఊదా రంగులో కనిపిస్తాయి. వ్యోమనౌక కిటికీ నుంచి భూమిని చూడటం మరిచిపోలేని అనుభూతి. మళ్లీ అంతరిక్షంలోకి వెళ్లే అవకాశం వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోను. ఓయూలో వనరులు అద్భుతంగా ఉన్నాయి. విద్యార్థులు ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి.

క్లుప్తంగా

చోరీ కేసులను త్వరగా ఛేదించాలి

ఎస్పీ కోటిరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: చోరీ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి దొంగతనాలను అరికట్టాలని ఎస్పీ కోటిరెడ్డి పోలీసులకు సూచించారు. బుధవారం తన కార్యాలయంలో ఐటీ కోర్, డీసీఆర్‌బీ, సీసీఎస్, ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీం అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ చోరీ కేసులను త్వరగా ఛేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మురళీధర్, కోర్‌టీం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ దాసు, ఆంజనేయులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బెట్టింగ్‌రాయుళ్ల అరెస్ట్

రూ.90వేల నగదు, 4 సెల్‌ఫోన్‌లు స్వాధీనం

అనంతగిరి: వికారాబాద్ పీఎస్ పరిధిలో ఐపీఎల్ బెట్టింగ్ పెడుతున్న నలుగురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్‌లో బెట్టింగ్ పెడుతున్నారని టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు వారు దాడి చేయగా బెట్టింగ్ పెడుతున్న నలుగురు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.90వేల నగదు, 4 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని వికారాబాద్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు.

పేదల 'సంక్షేమానికి' కృషి చేయాలి

ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్



పింఛన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ సంచిత్

కుల్కచర్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తూ.. నిరుపేదల సంక్షేమానికి ప్రతీ వ్యవస్థ పాటుపడాలని ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. బుధవారం ముజాహిద్‌పూర్, కుల్కచర్ల గ్రామాల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా నిరుపేదలకు లబ్ధిచేకూరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, క్షేత్ర స్థాయి ఉద్యోగులు కృషిచేయాలని సూచించారు. ముజాహిద్‌పూర్‌లో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి, వృద్ధులతో మాట్లాడారు. పింఛన్ డబ్బులు సరిపోతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుల్కచర్ల మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యలో శ్రీరామ లింగేశ్వర సిరిధాన్యాల ఉత్పత్తిదారుల సంఘం కమిటీతో మాట్లాడారు. చిరుధాన్యాల పెంపకం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, క్రయవిక్రయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ, ముజాహిద్‌పూర్ సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.



పెద్దేముల్: ఆరబెట్టిన పత్తి విత్తనాలు



బంట్వారం: తొర్మామిడిలో కూలిన ఇల్లు

అకాల వర్షాలు.. అన్నదాత కష్టాలు



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో పాడైన టమాటా పంట

అకాల వర్షాలతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ఈదురు గాలులు, వడగళ్ల వానతో చేతికి వచ్చిన పంట నీటిపాలైంది. ఉరుములు, పిడుగుపాటు జిల్లాను కుదిపేశాయి. నెల క్రితం కురిసిన వర్షాలతో నష్టపోయిన రైతులు తిరిగి నాట్లు వేసుకోగానే ప్రకృతి ప్రకోపం చూపింది. దీంతో వారి రోదనలు మిన్నంటుతున్నాయి.

గాలి, వాన బీభత్సం
- పంటలు నష్టపోయిన రైతులు
- పిడుగుపాటుకు మృత్యువాత పడిన మూగజీవాలు

మోమిన్‌పేట: మోమిన్‌పేటలోని ఆయా గ్రామాలలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు, వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రేకుల ఇళ్లు, కోళ్ల ఫారంలు, పశువుల పాకలు ఈదురు గాలులకు చెల్లాచెదురయ్యాయి. నెల క్రితం కురిసిన వర్షానికి కూరగాయ పంటలు, మొక్కజొన్న పంటలు, అరటి, బొప్పాయి, ఉల్లి పంటలు పూర్తిగా నష్టపోయారు. తిరిగి టమాట, మిర్చి, క్యాబేజీ, కాలీఫ్లవర్ నాట్లు వేసుకున్న రైతులను వాన నిండా ముంచింది. దీంతో అన్నదాతల రోదనలు మిన్నంటుతున్నాయి. మండల పరిధిలోని ఎన్కేపల్లి, మొరంగపల్లి, రాంనాథ్‌గుడుపల్లి, మల్లారెడ్డిగూడెం, ఏన్కతల గ్రామాల్లో కూరగాయ పంటలు, మొక్కజొన్న, బొప్పాయి పంటలు పూర్తిగా పాడయ్యాయి. ఏన్కతల సమీపంలో రోడ్డుపై చెట్టు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం

పాడైన పత్తి విత్తనాలు

పెద్దేముల్: మండల పరిధిలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షాలకు చెరుకు, అరటి రైతులకు మేలు చేకూరినా.. మొక్కజొన్న రైతులు, పత్తి మిల్లులు, సుద్ద వ్యాపారస్తులు ఇబ్బంది పడ్డారు. పత్తి విత్తనాలు వర్షాలకు పాడయ్యాయి. సుద్ద తవ్వకాలు నిలిచిపోయాయి.

నీట మునిగిన ధాన్యం రాశులు

దౌల్తాబాద్: మండల పరిధిలోని మంగళవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో రైతుల ధాన్యం రాశులు నీట మునిగాయి. నందారం గ్రామంలో చెరువు కట్ట పక్కన బండపై రైతులు ధాన్యం ఆరబోశారు. ఒక్కసారిగా కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. వరి పంటలు నేలకొరిగాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఉల్లి రైతుకు తప్పని తిప్పలు

కొడంగల్ రూరల్: మండల పరిధిలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు పంటలు నష్టపపోయారు. ఆయినన్‌పల్లి,బుల్కాపూర్, గుండ్లకుంట తదితర గ్రామాల్లో ఉల్లిపంట నష్టపోగా హస్నాబాద్ గ్రామ శివారులో మామిడితోటలో కాయలు నేలరాలాయి.హస్నాబాద్, పెద్దనందిగామలో దాదాపు 22మందికి పైగా రైతులు సాగుచేస్తున్నారు.కాయలు నేలరాలడంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తూ ప్రభుత్వం నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

165 ఎకరాల్లో పంట నష్టం

బంట్వారం: మండల పరిధిలో కురిసిన వర్షానికి భారీ నష్టం వాటిల్లింది. మొక్కజొన్న, అరటి, బొప్పాయి, జొన్న పంటలకు తీవ్ర నష్టం జరిగింది. పలు గ్రామాల్లో 165ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అదేవిధంగా యాచారం, కరీంపూర్, బార్వాద్, ఎన్నారం, మాల్‌శెట్టిపల్లి తండా ఫీడర్లలో 35 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో బుధవారం పలుఫీడర్ల పరిధిలో 15 కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ట్రాన్స్‌కో ఏఈ సురేశ్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయ పాలాలకు విద్యుత్ సరఫరా అయ్యే ఫీడర్ల పరిధిలో మరో 20 స్తంభాలు వేస్తామన్నారు.



హస్నాబాద్ మామిడితోటలో నేలరాలిన మామిడికాయలు



బంట్వారం: సుల్తాన్‌పూర్‌లో పశువులపై కూలిన షెడ్డు

పిడుగుపాటుకు ఆవు, దూడ మృతి

దోమ: పిడుగు పాటుకు ఆవు, దూడ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఖమ్మంనాచారం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మేడిపల్లి వెంకటయ్య అనే రైతు జీవనోపాధికి పాలిచ్చే ఆవు, ఓ దూడను పోషించుకుంటున్నాడు. అయితే మంగళవారం కురిసిన అకాల వర్షానికి పిడుగుపాటుకు గురై ఆవు, లేగదూడ అక్కడి అక్కడే మృత్యువాత పడ్డాయి. వాటి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ నర్సమ్మ, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతకుమార్ మృతి చెందిన పశువులను బుధవారం పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఆర్థికసాయం అందేలా చర్యలు తీసుకుంటామని రైతుకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేశ్, గ్రామస్తులు యాదయ్య, శ్రీశైలం, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అక్కంపల్లిలో కాడెద్లు..

యాలాల:మండల పరిధిలో మంగళవారం అర్ధరా త్రి భారీ వర్షం కురిసింది. దీంతో అక్కంపల్లిలో రై తు కావలి అశోక్ తన పాలం వద్ద పాకలో కట్టేసిన కాడెడ్లపై పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో రైతుకు రూ.లక్షన్నరకు పైగా ఆర్థిక నష్టం వాటిల్లిందని.. తనను ప్రభుత్వమే ఆదుకో వాలని రైతు వేడుకున్నాడు. సమాచారం అందుకున్న మండల పశువైద్యుడు శ్రీకర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనారాయణ బుధవారం పంచనామా చేశారు.



కుల్కచర్ల: కుస్మసముద్రంలో మృతిచెందిన ఎద్దు

నిలిచిన రాకపోకలు

పటేల్‌చింతతండాలో ఈదురు గాలులతో పశువుల పాక కూలిపోయింది. ఆ సమయంలో పాకలో ఉన్న ఆరు పశువులకు గాయాలయ్యాయి. కాగా పటేల్ చింతతండాకు వెళ్లేదారిలోని అన్నారం వాగు ప్రవహించడంతో గాయాలైన జీవాలకు చికిత్స అందించలేని పరిస్థితి ఏర్పడిందని తండా వాసులు వాపోయారు. మంగళవారం 40మిమీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ గోవిందమ్మ తెలిపారు.



యాలాల: అక్కంపల్లిలో మృత్యువాత పడిన కాడెద్లకు పంచనామా చేస్తున్న పశువైద్యుడు

విద్యుదాఘాతంతో గేదె

కుల్కచర్ల: అకాల వర్షం రైతులకు ఆవేదన మిగిల్చింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కుస్మసముద్రం, చౌడాపూర్‌లలో పిడుగు పడి రెండ్లు ఎడ్లు మృతిచెందాయి. కుస్మసముద్రం గ్రామానికి చెందిన తుప్పుడు వెంకటయ్య, చౌడాపూర్ గ్రామానికి చెందిన మాందువాద కృష్ణయ్య రోజులాగే తమ ఎడ్లను పొలం వద్ద కట్టేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగుపడి ఎడ్లు అక్కడికక్కడే మృతిచెందాయి. వర్షం వల్ల తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి పందివనంపల్లి గ్రామానికి చెందిన అనంతయ్య అనే రైతుకు చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతిచెందింది.



యాలాల: పటేల్ చింతతండాకు వెళ్లే మార్గంలో ప్రవహిస్తున్న అన్నారం వాగు



మర్పల్లి: రామాపూర్‌లో నేలకొరిగిన మొక్క జొన్న



మోమిన్‌పేట: మొరంగపల్లిలో వడగళ్ల వానకు పాడైన బొప్పాయి తోట

రాజకీయాల్లో సినిమా డైలాగ్‌లు చెల్లవు

- రెవెన్యూ రహిత జిల్లా ఏర్పాటు ఘనత బీఆర్‌ఎస్‌దే
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద్ రెడ్డి

వికారాబాద్ అర్బన్: రాజకీయాల్లో సినిమా డైలాగ్‌లు చెల్లవని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్‌లకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు టి.సదానంద్‌రెడ్డి హితవు పలికారు. వారివి పంచ్ డైలాగ్‌లు తప్పా.. అభివృద్ధి చేసిందేమీ లేదని విమర్శించారు. బుధవారం ఆయన మాజీ మంత్రి చంద్రశేఖర్ నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సదానంద్‌రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్లలో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభ సక్సెస్ అవ్వడంతో బీఆర్‌ఎస్ నాయకుల్లో గుబులు మొదలయిందన్నారు. అందుకే వారు అమిత్‌షాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. జిల్లా ఏర్పాటులోనే బీఆర్‌ఎస్ నాయకులు కుట్రలు పన్నారని ఆరోపించారు. ఏమాత్రం రెవెన్యూ లేని అస్తవ్యస్తమైన జిల్లా ఏర్పాటు ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. వికారాబాద్‌కు అతి చేరువలో ఉన్న చేవెళ్ల, శంకర్‌పల్లిని జిల్లా నుంచి ఎందుకు విడదీశారో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు జూరాల నుంచి సాగునీరు తీసుకురావాలని నిర్ణయించిన బీఆర్‌ఎస్.. మాట మార్చి శ్రీశైలం వైపు ఎందుకు మళ్లించారో చెప్పాలన్నారు. నిర్ణయం తీసుకుని తొమ్మిదేళ్లు గడుస్తున్నా నేటికీ చుక్క నీరు అందలేదని దీనిపై ఎంపీ, ఎమ్మెల్యేలు సమాధానం చెప్పాలన్నారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు జాతీయ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే నిర్మాణంలో ఆలస్యం జరిగిందని ఆరోపించారు. రూర్బన్ పథకం కింద కేంద్రప్రభుత్వం తాండూరులోని జినుగుర్తి వద్ద స్కిల్ డెవలప్‌మెంట్ భవనం నిర్మిస్తుంటే ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 40శాతం నిధులు ఇవ్వక పోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. అనంతగిరి అభివృద్ధికి కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి రూ.100 కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా ఎమ్మెల్యే అందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇవ్వడం లేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అబద్ధాలను ప్రజలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, రాఘవన్ నాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సదానంద్ రెడ్డి

'మిషన్-50 డేస్'తో చైతన్య కార్యక్రమాలు

- మాదిగలను మోసం చేసిన ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు
- ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివ

తాండూరు టౌన్: రాజకీయ పార్టీల మోసాలను ప్రజలకు అవగాహన కల్పించేందుకు మిషన్-50 డేస్ పేరుతో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ అన్నారు. బుధవారం సంఘం జిల్లా కన్వీనర్ మల్లికార్జున మాదిగ ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే వర్గీకరణ చేపడతామని చెప్పిన పార్టీలన్నీ మాదిగలను మోసం చేశాయని ఆరోపించారు. వంద రోజుల్లో వర్గీకరణ చేపడతామని గద్దెనెక్కిన బీజేపీ మాట తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగలకు అన్యాయం చేస్తున్న పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మాదిగ, ఉప కులాలను ఏకం చేసేందుకు 50 రోజులపాటు పల్లె పల్లెకూ ఎమ్మార్పీఎస్ పేరుతో 'మిషన్-50 డేస్' చైతన్య కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. 29 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో అలుపెరగని పోరాటం చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ప్రకాశ్, శేఖర్, మల్కప్ప, రవి, నరసింహ, స్వామిదాస్, పుష్పరాణి, శ్రీనివాస్, అజయ్ ప్రసాద్, వెంకట్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివ

అదుపుతప్పిన బైక్..

దోమ:ప్రమాదాల నివారణకు వేసిన స్పీడ్ బ్రేకర్లు అశాస్త్రీయంగా నిర్మించడంతో వాహనదారులకు ప్రతికూలంగా మారుతున్నాయి. మండల పరిధిలోని దిర్సంపల్లితండా సమీపంలో స్పీడ్ బ్రేకర్ కారణంగా బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి.ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం..బట్ల చందారం గ్రామానికి చెందిన కావలి వెంకటయ్య నగరంలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 3న నగరం నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు.ఈ ప్రమాదంలో బాధితుడికి తీవ్ర గాయాలవ్వడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను వెంటనే పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం ఆయన కోమాలో ఉన్నాడి ఆయన పరిస్థితి విషమంగా ఉందని బాధితురాలి భార్య సావిత్రి వెల్లడించారు. ఆమె బుధవారం స్థానిక పీఎస్‌లో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుకు కారుకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

వీఓఏల పట్ల వివక్ష తగదు

- ఎమ్మెల్యే ఈటల రాజేందర్

కద్లాల్: బీజేపీ వీఓఏల పట్ల ప్రభుత్వం వివక్షత వీడి.. మహిళా సంఘాలకు ఇచ్చే బకాయిలు విడుదల చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. తమ సమసల్య పరిష్కారానికి వీఓఏలు చేపట్టిన సమ్మె బుధవారంతో పదో రోజుకు చేరింది. వారి ఎమ్మెల్యే ఈటల, బీజేపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ వీఓఏలకు సెర్ప్ ఉద్యోగుల మాదిరిగానే అన్ని సౌకర్యాలు కలిస్తామని చెప్పి.. గద్దెనెక్కి హామీని విస్మరించారని విమర్శించారు. పదిరోజులుగా సమ్మె చేస్తుంటే మంత్రులు, ఎమ్మెల్యేలు ఆటపాటలతో కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ.26వేల కనీస వేతనం, ఆరోగ్యభద్రత, జీవితబీమా కల్పించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వీఓఏలు తమ సమస్యలపై ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్య, రాష్ట్ర నాయకులు శంకర్‌నాయక్, డాక్టర్ రమేశ్ అయ్యగార్, రవీందర్‌రెడ్డి, సాయిలాల్, లక్ష్మణ్ నాయక్, వెంకటేశ్, ప్రేమ్‌రాథోడ్, దశరథ, శ్రీకాంత్, శివ, ప్రవీణ్, వీఓఏ సంఘం నాయకులు ఉన్నారు.



వీఓఏల దీక్షలో కూర్చుని సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే ఈటల